

శ్రీ ఎలవర్తివారితో సంభాషించుటయన్న
ఒక విజ్ఞాన ప్రదాయకమైన గ్రంథమును
పఠించుటకన్న మిన్న

# సాహితీవేత్త

## శ్రీ కొల్లా కృష్ణారావు

ఈనాడు విద్యార్థులకుఁ త్రికరణశుద్ధిగా విద్యాధనమింత పంచి యిచ్చుటతో పాటు విజ్ఞాన జ్యోతిని వెలిఁగించు సాహిత్య సాంస్కృతిక గాథలు బోధించి సంఘము నుద్ధరించునధ్యాపకులెందఱు గలరు? శ్రీ ఎలవర్తి రోశయ్య గారి వంటివారు వ్రేళ్ళమీద లెక్కకు వత్తురేమో; ఆయన యభ్యసించినది యాంగ్లము. ఆఁకట్టుకొన్నది యాంధ్రభాషావైశారద్యము. వారి సాహితీ వ్యాసంగము సన్నిహితులకెఱుక. జీవితములోని మెఱుఁగు లాత్మీయులకే యర్థమగును. వారు వయస్సులోఁ బెద్దలయ్యు చారిత్రకముగా అస్మదాదులకు సమకాలికులు వారితోనాకుఁగల చిరపరిచయమునకు గర్వింతును. అతిపరిచయా దవజ్ఞాయన్నట్లు మనపెరటిలోని మంచి మొక్కల విలువను మనము గుర్తింపలేక పోవు విచార్యము. శ్రీరోశయ్యగారిలోనున్న విశేషాంశము లెందఱెఱుంగుదురు?

దాదాపిది యేబది మూడేండ్లనాటి మాట. శ్రీ కొండవీటి వేంకటకవి గారితోఁగలసి యొక ఆదివారమునాడు శ్రీ రోశయ్య గారింటికి వెళ్లితిని. పడక కుర్చీలో గూర్చొని చదువుకొనుచున్నారు. అంతకు ముందు వారిని గూర్చివినియున్నవాడనే కాని చూచుట అదియే మొదటిసారి. కాంతి నెగజిమ్ము కనుదోయి. కోటేరువంటి ముక్కు. తిన్నని నెన్నుదురు. అందమైన నొక్కులు గల కేశపాశము. ఎత్తునకు దగినలావు. ముచ్చట గొలుపు నెఱుపు రూపము. రూపు దాల్చిన సారస్వతము. ఆనాడచ్చటనే మా కాతిథ్యము. ఇంకేమున్నది? గంటల తరబడి సాహితీ ప్రసంగములతో గాలక్షేపము చేసితిమి. ఆయనకు ప్రాచీన

వాఙ్మయమునందెంతటి యభినివేశమున్నదో నవీన సాహిత్యముపై నంతటి యభిమానమున్నది. కాని గ్రాంధికవాది. వ్యావహారిక వాదము నెంత మాత్రము సహింపరు. సంప్రదాయ సాహిత్యమందలి జగ్గు నిగ్గులు తేల్పగల నేర్పరి. శ్రీవెంకటకవిగారు, నేను కొన్ని స్వీయ రచనలు వినిపించునప్పుడు జోక్యము గల్పించుకొని ప్రసిద్ధములైన ప్రాచీన కావ్యములలోని రసోదంచితమైన పెక్కు పద్యములనేకాక కళాప్రపూర్ణ శ్రీ త్రిపురాన వేంకట సూర్య ప్రసాదరావు గారు రచించిన 'రఘూదయము'- కాళిదాసు మేఘసందేశమున కనువాదమైన 'మొయిలు రాయబారము' కావ్యములలోని పద్యములను విఱుపులతో జదివి యందలి భావ మాధుర్యమును, శిల్ప నైపుణ్యమును, శైలీ సౌకుమార్యమును విశదీకరించిరి. నిర్దుష్టమైన ఉచ్చారణలో ఆయనకు ఆయనేసాటి. వారికిగల పరిపూర్ణమైన విషయ పరిజ్ఞానమునకు నేను పరవశుడనైతి. ప్రాచీనాంధ్ర కావ్యములలో వేలకొలది పద్యములు కంఠస్థమని చాటి చెప్పుకొను శ్రీ వేంకటకవిగారు శ్రీ రోశయ్యగారి ధారణ కాశ్చర్యపడిరి. శ్రీ ఎలవర్తివారితో సంభాషించుటయన్న ఒక విజ్ఞాన ప్రదాయకమైన గ్రంథమును పఠించుటకన్న మిన్న. మా మాటల సందర్భమున బాల వ్యాకరణము విషయము వచ్చినది. దానితో శ్రీ రోశయ్యగారి యొడలుప్పొంగినది. వీరావేశముతో చిన్నయసూరి సూత్రరచనా పాటవమును విశ్లేషించిరి. అంతియకాదు - నీతిచంద్రిక వచన రచనలోని వాక్య ప్రయోగ వైచిత్రిని, సాక్షిలోని విమర్శనాత్మక విశేషమును విశదపఱచిరి. ప్రబంధకర్తలలో రామరాజ భూషణుడు, వ్యాకరణకర్తలలో చిన్నయసూరి, వ్యాఖ్యాతలలో దేవరాజ సుధీమణి అనిన ఆయనకు బంచ ప్రాణములు. అందు చేతనే వారి బిడ్డలకు ఆ నామధేయములు పెట్టుకొనిరి. ఏమా యభిమానము; అధ్యయనము- అధ్యాపనము వారి జీవితమునకు ఓత ప్రోతములు. వారు సేకరించిన అమూల్య గ్రంథములయందు గుఱుతు పెట్టిన ఎట్టుగీతలను బరిశీలించినచో వారెంతటి సాహిత్య విశారదులో మన కవగతమగును. సంగీతపతి సాహిత్యమ్....కదా; శ్రీ రోశయ్యగారు సంగీతమనిన చెవిగోసికొందురు.

విద్యార్థి దశలో వ్యయప్రయాసలు లెక్కింపక నిష్ఠతో నాంగ్లభారతి నారాధించిన వాడైన నాంధ్రవాణీ సపర్యలనేమఱచి యుండలేదు. కళాశాలలో ఆంగ్లభాషగా సమకూర్చుకొన్న ఆంధ్రమే జీవితములో ప్రధానాంగముగా బరిఢవిల్లినది. అందలిలోతుపాతులు తడవి చూచిన మనీషి. కవిరాజు శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారి సన్మాన సంచికలో విషయ పరిశోధనలు - రసవత్కవులు - శ్రీ త్రిపురానవారి, శ్రీ భగవద్గీతామృతమునకు సంతరించిన పరిచయము మున్నగువానిని చదివిన వారెంత చేయి తిరిగిన రచయితలో మనమూహింపవచ్చును. అంతటి ప్రతిభాశాలి గ్రంథ రచన గావింపకపోవుట మా దృశులకు గొంచెము కష్టముగానే యున్నది.

1953వ సంవత్సరము మార్చి నెలలో గాబోలు ప్రౌఢకవి శ్రీ అమ్మశెట్టి లక్ష్మయ్యగారికి మా స్వగ్రామమైన పెదకూరపాటిలో ఘన సన్మానము చేసితిమి. ఆ సభకు ప్రముఖ విద్యావేత్త శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తి గారధ్యక్షులు. శ్రీ రోశయ్యగారితోపాటు పండిత శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి, సుధీమిత్ర, శ్రీ జంపాల వేంకట నృసింహము, శ్రీ కొండవీటి వేంకటకవి వంటి పలువురు పండిత ప్రకాండలు వక్తలుగా విచ్చేసిరి. అందఱి యుపన్యాసము లొకయెత్తు-శ్రీ రోశయ్య గారి యుపన్యాసమొకయెత్తు. శ్రీ అమ్మిశెట్టివారి కవితా వైశిష్ట్యమునే కాక-అనేక విషయములను ముఖ్యముగా గ్రామీణులకు సంబంధించిన అంశములను, విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల బాధ్యతలు ప్రస్తావించి కావించిన ప్రసంగము మఱపురానిది. మఱువలేనిది. వారు చెప్పిన మాటలు రత్నాల మూటలు. సభికులనెక్కువగా నాకర్షించినవి. సభానంతరము శ్రీ లక్ష్మయ్యగారు జదివిన కృతజ్ఞతాంజలి పద్యములలో మున్మొదట ఆంధ్రాంగ్ల భాషా మహోద్ధిమంథానాద్రి అని శ్రీ రోశయ్యగారిని శ్లాఘించుట గమనార్హము. ఆ సన్నివేశములిప్పటికి నా హృదయములో మధుర స్మృతులుగా నిలిచియున్నవి.

అభినవ తిక్కన, తెనుగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారొక పద్యమున యశోవంతము అని ప్రయోగించిరి. దానిని గమనించిన శ్రీ రోశయ్యగారు జరిగిన పొరపాటును సున్నితముగా

దెలియజేయుచు-మకారమునకు బదులు వకారము పడినదని ఈ ముద్రారాక్షసమును సవరించు కొనవలయునని దోషమును పరోక్షముగా సూచించుచు నొక ఉత్తరము వ్రాసిరి. ఆ లేఖకు శ్రీ తుమ్మలవారు ప్రతిస్పదించుచు అది యచ్చుతప్పుగాదని, తన తప్పేనని యొప్పుకొనిరి. ఎంతటి వినమ్రత; అదియే మహాకవుల లక్షణము. ఆ తరువాత శ్రీ రోశయ్యగారిని ప్రశంసించుచు గొన్ని పద్యములు రచించిరి. అందీ విషయము నుటంకించుచు-

మఱపునంబడికా దెఱుకలేక
వ్రాసినాడను మును యశోవంతమనుచు
దోసమునీ దీని దెల్పిన ధీ సముద్రు
డితడ మేవడియై దనకే కతమున.

అని కొనియాడిరి. శ్రీ ఎలవర్తి వారి కృషి చిరస్మరణీయము. ఒక వంక అధ్యాపకవృత్తి-మఱొకవంక కమ్మ హాస్టలు నిర్వహణ. ఎప్పుడు నెవరో యెకరు వచ్చి పోవుచుందురు. ఆయనకు విసుగు విరామము లేదు. రైతు కుటుంబమున జన్మించి జన్మతః విశిష్ట గుణసంపత్తిని పుణికిపుచ్చుకొన్న వారి గృహమొక సాహితీ సదనము. ప్రముఖ కవులెందఱో వారి రచనలు వినిపించి పోయెదరు. మా బోటివారి నభిమానించిన తీరు అనుభవైక వైద్యమే కాని వ్రాయ నలవికాదు. వ్యక్తిత్వము విశిష్టమైనది. నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చెడివారు. స్తుతి-ముఖస్తుతులు పూర్తిగా సరిపడని సంగతులు. అఱమరికలులేని సహృదయులు. శిష్యవాత్సల్యము మూర్తీభవించిన దేశికోత్తములు. క్రియా కేవలముత్తరమ్మను తత్త్వముగల కర్తవ్య పరాయణులు.

గుంటూరు-ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఆయన గడించిన పేరు ప్రతిష్ఠలు గుర్తించి జాగర్లమూడి కుప్పుస్వామిచౌదరి కళాశాల పాలక వర్గము ముఖ్యముగా డాక్టరు సదాశివరావుగారు కళాశాల కులపతిగా నియమించిరి. శ్రీ రోశయ్యగారి వాక్కులో గొలది కాఠిన్యమున్నను మనస్సు వెన్నవంటిది. పరిపాలనాదక్షతను, విధినిర్వహణా నైపుణ్యమును ప్రదర్శించి విద్యా ప్రమాణముల సాధనకు, క్రమశిక్షణ వికాసమునకు పునాదులు వేసిరి. అటువంటి సాహితీవేత్తకు నా స్మృత్యంజలి.